ఓంశ్రీసాయిరాం

సేవలద్వారా మీలోని ఆత్మతత్త్వమును అర్థము చేసుకోవలెను. ఇదే సత్యసాయి సేవాదళముయొక్క స్థాపనకు ముఖ్య ఉద్దేశ్యము. నిన్న నియమించిన కమిటీలు ఎన్నో సలహాలనందించారేగాని వాటిని ఆచరణలో పెట్టుటకు మీరు సంసిద్ధులై ఉన్నారా అనేది పెద్ద ప్రశ్న. మానవుడు సాకారమైన సత్యస్వరూపుడు. సమాజమనేదికూడా దైవాంశసంభూతులైన మానవ సమూహమే. అది అహంకార ప్రేరిత సమూహముకాదు. జీవితము భోగనిమిత్తము రాలేదు. సేవనిమిత్తమై వచ్చినదే, సమాజసేవ నిమిత్తమై. విరాట్స్వరూపమైన సమాజముయొక్క సేవనిమిత్తమై. ప్రకృతిలోనుంచి ఆత్మలోనికి ప్రవేశించి ప్రకాశింపజేసేదే సాయిబోధ. మీ స్వస్థానము ఆత్మస్థానమే. నిశ్చల నిర్మల నిస్వార్థమే మీ నిజస్వరూపము. సేవ వలన లభించే ప్రేమాభివృద్ధి, అహంకార నాశనము, ఆనందజ్యోతి వీటిని అనుభవమునకు తెచ్చుకొనుటయే సేవాదళ సభ్యుల ముఖ్యకర్తవ్యము.

సేవాదళ సభ్యుల అర్హతలు ఏమిటనే ప్రశ్న వచ్చింది. సత్యసాయిపైన సంపూర్ణవిశ్వాసము కలిగిన వరే దళములో చేరి కార్యక్రమములో పాల్గొనుటకు అర్హులు. సత్యసాయిబోధనలపై భక్తిశ్రద్ధలు లేక, సత్యసాయి సేవాదళమువారు అని ఎట్ల చేప్పుకొనేది? ఆ విశ్వాసమును దృఢముచేసుకొని తరువాత దళములో చేరి, దానియొక్క ఆశయాలను అలక్ష్యముచేయక, వాటికి విరుద్ధముగా వర్తించక, శక్తిసామర్థ్యములన్నిటినీ వంచనలేక సేవాకార్యక్రమములలో వినియోగించండి. మీకు రూపనామములున్నవి. కానీ, సత్యసాయి ప్రబోధనకు రూనామములు లేవు. కాబట్టి, కులము, మతము, వ్యక్తి అనే భేదములను గమనించక, అందరూ ఆ ఆశయాలకు తగిన జీవితమునకు పూనుకోండి.

ఇంక, దళముయొక్క కన్వీనర్లకు కొన్ని నిబంధనలు. వీరు గ్రామములకు వెళ్ళి అక్కడ సాయి బోధనలను గురించి ప్రసంగించే శక్తిసామర్థ్యములు కూడా ఉండవలెను. భారతీయ వాఙ్మయములోని రామాయణ భారత భాగవతములనే దివ్యదీపికలను అందరూ చక్కగా పఠించవలెను. విద్యార్థులు పెద్దవయస్సు వాళ్ళుకూడా పిచ్చిపిచ్చి కథలను చదువుదురేగాని ఈ పవిత్రగ్రంథములను చదువుటకు పూనుకోటంలేదు. పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం; పరోపకారార్థమిదం శరీరం; అనే సూక్తులను సోదాహరణముగా ఈ గ్రంథములందించును. ఈ మూడు గ్రంథముల చక్కని పరియములేక భారతీయ సంస్కృతి ఎవ్వరికీ అర్థముకాదు. సభ్యులందరూ ఆ సంస్కృతిని తెలుసుకొని ఆచరించి ఆనందించవలెను. కాన, వారికి ఈ గ్రంథముల పఠన అత్యవసరము.

కన్వీనర్లు, లీడర్లు కాబట్టి వారి నడతలు, వారి పలుకులు అతి పవిత్రముగా ఉండవలెను. ఇతరులు అనుసరించే కొరకు వారే ఆదర్శములనందించవలెను కదా! కొన్ని ప్రాంతములందు కన్వీనర్లు లీడర్లుకాక, ఫ్లీడర్లుగా వాగ్వాదములో సమర్థులౌతున్నారు. కన్వీనర్లు చేసి చెప్పువారుగా ఉండాలికాని చెప్పి చేయించువారు కాకూడదు. ఇప్పుడు ప్రపంచమే ఆ ధోరణిలో పోవుచున్నది. అన్ని క్షేత్రములలోనూ అంతే. ఇట్టివారలకు సత్యసాయి సంస్థలో ఏమాత్రమూ స్థానములేదు. దీనిలో చేరి నేను పనిచేయలేను, అనిన అది మహాపాపమే. అట్లుకాక మార్గదర్శకులుగా ఉత్సాహముతో, భక్తిప్రపత్తులతో మీరు సేవలు సలిపిన తప్పక నేను చూచుకోగలను. స్వామి అనుగ్రహము సంపూర్ణముగా ఉండును.

ఇక, సేవాదళ సభ్యుల వయఃప్రమాణము. సేవ సలుపుటకు ఈ రీతి హద్దులుండవలెనని సందేహము కలిగేది సహజమే. వాలంటీర్లకు వయఃపరిమితి నిర్ణయించనక్కరలేదు. వారు తమ శక్త్యానుసారము అవకాశము దొరికినపుడు సేవచేయవచ్చును. అయితే, సేవాదళమునకు నియమనిబంధనలు అత్యవసరము. ఇపుడు పురుషుల వయస్సు 18-35 సంవత్సరములనియు, స్త్రీల వయస్సు 18-40 సంవత్సరములవనియూ నిర్ణీతమై ఉన్నది. ఇది సరైనదే. క్రమశిక్షణమున శ్రద్ధ, ఉత్సాహము మొదలైనవి వృద్ధులలో నిరీక్షించుటకవకాశముండదు. సభ్యులందరూ సమవయస్కులైనచో వారికి సేవాకార్యములలో మరింత ఉత్సామబ్బును. సమవయస్కులు మందలించిన, దానిని, ఎక్కువ అవమానముగా భావించి, సభ్యులు దిద్దుకొంటారుకూడ. 18 వయస్సుగల యువకుని 69సంవత్సరముల వయస్సుగల వ్యక్తి మందలించిన దానిని నాకు ప్రమాణముగా స్వీకరించక, అలక్ష్యముచేస్తే సంభవమున్నది. కాలమార్పు విషయము మీకేమి తెలియును. మీరంతా పాతకాలము వారని వాడు ఆ వృద్ధుని తిరస్కరించవచ్చు. కాబట్టి, 40 సంవత్సరములు వయస్సు దాటిన తరువాత, తమ శక్తికొద్దీ తాము వాలంటీర్లుగా సేవ సలిపేది మంచిది.

రాముడు నరాకారమును ధరించిన వ్యక్తి. సుగ్రీవుడు వానరాకారమును ధరించిన వ్యక్తి. అయిననూ వారిరువురికీ అవస్థాసన్నిహితము వలన, వయఃసన్నిహితము వలన, బాధాసన్నిహితము వలన గాఢమైన సన్నిహితము తటస్థించినది. ఇద్దరికీ సోదర నిమిత్తము అరణ్యవాసము సంభవించినది. ఇద్దరూ రాజ్యభ్రష్టులు. ఇద్దరికీ భార్యావియోగము. దీనినిబట్టి చూచిన సమవయస్కులు యువకులు బుద్ధిబలము కలవారు సేవాదళ సభ్యులుగా ఉండుటయే మంచిదని తేలును. మనోబలము, దేహబలము, ఉత్సాహబలము అన్నీ పూర్తిగా సేవాకార్యములలో వినియోగించు యువకులు గ్రామసీమలలో కార్యనిరతులైనచో పల్లెలవారుకూడా సేవలో పాల్గొనుటకు పూనుకొందురు.

మరొకవిషయము. సేవాదళము యువకుల మేలుకొరకే స్థాపితమైనది. ఇపుడు భారతీయ సంస్కృతి ఏమిటో తెలియక

ఆధ్యాత్మిక మార్గములో కాలుపెట్టక, యోగము, ధ్యానము, జపము అసలే పట్టక యువకులు అశాంతికి గురౌతున్నారు. పెద్దలంటే విశ్వాసము లేదు. పాపభీతి లేదు. దైవప్రీతి లేదు. వారు ఒక సత్యసాయి ప్రేమకు మాత్రమే కట్టుబడ్డారు కానీ మరొకరి మాటలు వినే స్వభావములో లేరు. అదికూడా ఏ కారణము వలన అనిన సత్యసాయి ఎల్లప్పుడూ తానుచేసి మరొకరికి చెబుతారు. ఆపని, ఈపని అనిలేకుండా అన్నిటిలోనూ చేరుకుంటారు. నాకూ, వారికీ సంబంధించిన ప్రేమ సూత్రము అది.

ఇక కొన్ని మార్పులనుకూడ మన నిబంధనలలో చేయతలంచుచున్నాము. ఇంతవరకు ఒక లక్ష జనాభా కలిగిన పట్టణములలో మాత్రమే సేవాదళములను స్థాపించుటకు సమ్మతించినాము. ఇకపై ప్రతి పల్లెలోనూ సేవాదళములను స్థాపించవచ్చు. దానికి ఏమాత్రమూ అభ్యంతరము లేదు. పల్లెలయందే ఇప్పుడు జీవితము ఎక్కువ బాధగా వుండేది. అక్కడి అశక్తులకు, రోగులకు, అమాయకులకు పలురీతుల సహాయము యిపుడు అత్యవసరము. పట్టణములలో వీటికి ఎన్నో సంస్థలున్నాయి. పల్లెలలో తక్కువ. ఆహారవిహారాదుల మార్పు వలన అనారోగ్యము తీవ్రమై బాధపడేవాళ్ళను, అశాంతిలోబడి అల్లాడేవాళ్ళను ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశింపజేసే అవకాశమున్నది. నామసంకీర్తనతో, భజనలతో అపవిత్ర వాతావరణము శుభ్రపరచవలెను. సేవాదళములోని డాక్టర్లు, లాయర్లు పల్లెలవారి సమస్యలను పరిహరింప పూనుకొనవలయును. వారికి తగు సలహాలిచ్చి సహాయపడవలెను. ఆధ్యాత్మిక కథలను తెలిపి వారి హృదయములలో సోదరభావమును, ప్రేమతత్త్వమును నాటవలెను.

జిల్లాకొక కన్వీనరు, రాష్ట్రమునకొక కన్వీనరు. వీరు సేవాదళముయొక్క స్థాపన, పోషణ, శిక్షణ కార్యముల అభివృద్ధి కొరకు నియమించలెనని నా సంకల్పము. ఇక, యూనిఫారం విషయం. మీ డ్రెస్సు వికారముగా, విచిత్రముగా ఉంటే మిమ్ములను ఎవరూ సహాయమడగరు, సమీపించరు. నవనవీనఫ్యాషన్లరీత్యా ఆడవారు, మగవారు రకరకాల ఆడంబర అలంకారములు చేసుకుంటూ తిరిగితే సామాన్య జనులు వారినుండి దూరముగానే ఉంటారు. దేహరక్షణ, మీ గౌరవరక్షణ రెండునూ మీరు డ్రెస్సువలన నిర్వహించుకోవలెను, అంతే. యూనిఫారం అని మీ డ్రెస్సుకు నేనేమాత్రము విలువనీయను. అయితే, మీమీ హృదయమునకు ప్రేమవస్త్రము ధరించండి. మీమీ కంటికి సమదృష్టిని తగిలించండి. అదే నాకు కావలిసిన మీ యూనిఫారం. నాకు సంబంధించినంతవరకు అంతే చాలు. అయితే, జిల్లాసమ్మేళనములు, అఖిలభారత సమ్మేళనములు జరుగు సమయమున యూనిఫారం ఒకటి ధరించవలసియున్నది. తెల్లటి వస్త్రములే, నిర్మలనిస్వార్థ మనోభావముయొక్క చిహ్నములు. నక్కలు కుక్కలు మొదలైన వికార చిత్రములు లేని ఫల్ఆర్మ్ షర్ట్, డ్రైనేజి పైపువలవలె వద్దు, సరైన ప్యాంట్లు, వీటిని ధరించండి.

ఇక, వాలంటీర్లకు సేవాదళ సభ్యులకు భేదమేమిటనే ప్రశ్న వచ్చింది. సేవాదళ సభ్యులు ఎల్లవేళల, ఎక్కడ ఉండిననూ సేవకు సిద్ధముగా ఉండవలెను. వారికి ప్రత్యేక ఆధ్యాత్మిక శిక్షణకూడా విధింపబడినది. వారు అనేకరీతుల సేవాకార్యములకై సుశిక్షుతులుగా సదా సంసిద్ధులై ఉంటారు. అయితే, వాలంటీర్లు సమావేశములందు మాత్రము వారివారి శక్తికొలది వారివారి కర్తవ్యకర్మలను ఆచరింతురు. వారికి శిక్షణతోగాని, నిబంధనలతోగాని అంత పనియుండదు.

మరొక ముఖ్యమైన విషయము. సేవామనోభావము మీమీ ఇండ్లలోనే మొట్టమొదట కార్యగతము కావాలి. మీమీ తల్లదండ్రుల సేవచేయక, బయట మీరేమిచేసిననూ స్వామి అనుగ్రహించరు. వారు అనారోగ్యముతో బాధపడుచుండగా, వారి శుశ్రూషను అలక్ష్యముచేసి, మీరు బయట ఎంతమందికి ఉపకారముచేసిననూ అదంతా అపకారమేయగును. వారిని గౌరవించి, వారిని ప్రసన్నులనుగావించితే తప్పక స్వామి అనుగ్రహము మీవెంట జంటవుండి కంటిరెప్పవలె మిమ్ములను కాపాడును. మీ జీవితములను పవిత్రముగావించే ప్రయత్నమును, సార్థకముచేసుకోనే సాధనలను ఇంటిలో ప్రారంభించండి. తరువాత బయట వెళ్ళటానికి పూనుకోండి.

కాలమును వ్యర్థముచేయక. కాయమును దుర్వినియోగపరచక కర్మాచరణయందు కాలుపెట్టండి. అహంకారమునకు, అవినీతికి చోటివ్వక, ఆడంబరజీవితమునాశించక, అన్యోన్యభావమునభివృద్ధిచేసుకొని మీ ఆత్మోద్ధారమును, దేశోన్నతిని, లోకకళ్యాణమును సాధించండి.